ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద, చిన్న చెరువులు.. వాటి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను పరిశీలిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నంపై హైడ్రా నజర్

- ఇబ్రహీంపట్నం, తుర్కయాంజాల్ మాసబ్ చెరువుల పరిశీలన
- అక్రమ నిర్మాణాలు గుర్తింపు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 23: హైదరాబాద్‌కే పరిమితమైన హైడ్రా.. శివారు ప్రాంతాలపైనా దృష్టి సారించింది. సోమవారం హైడ్రా అధికారులు ఇరిగేషన్, పోలీసు, రెవెన్యూ శాఖల ఆఫీసర్లతో కలిసి తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మాసబ్‌చెరువు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద, చిన్న చెరువులు.. వాటి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో వెలిసిన అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. మాసబ్ చెరువు ఎఫ్‌టీఎల్ సుమారు 500 ఎకరాలుండగా ప్రస్తుతం అది 300 ఎకరాలకు కుచించుకుపోయింది. ఈ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు వెలిసినట్టు అధికారులు గుర్తించారు. వాటిపై కొరడా ఝుళిపించేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో అక్రమ నిర్మాణాలు చేపట్టిన నిర్మాణదారుల్లో భయం పట్టుకున్నది.

చెరువుల మాయంపైనా హైడ్రా కన్ను

నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువులనూ చెరపట్టారు. వాటిని ప్లాట్లుగా చేసి విక్రయించారు. దీంతో పలు చెరువులు, కుంటలు మాయమయ్యాయి. కాగా హైడ్రా అధికారులు ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువులు, కుంటలపై ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఇరిగేషన్ ఆధీనంలో ఎన్ని చెరువులు, కుంటలున్నాయి? వాటిలో ఎన్ని కబ్జాకు గురయ్యాయి? అన్న కోణంలోనూ విచారణ జరుపుతున్నారు. ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, తుర్కయాంజాల్, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీల పరిధిలో అక్రమ నిర్మాణాల గుర్తింపు పనులను ముమ్మరం చేశారు.

కేసీఆర్ సారూ మమ్మల్ని రక్షించండి!

- అధికారుల కూల్చివేతల్లో ఉపాధి కోల్పోయిన తల్లీకొడుకు వేడుకోలు
- మల్లాపూర్‌లో ఫుట్‌పాత్‌పై చెప్పల దుకాణాన్ని తొలగించిన మున్సిపల్ అధికారులు

మల్లాపూర్, సెప్టెంబర్ 23: కాంగ్రెస్ సర్కార్‌లో పేదోళ్లు గూడుతో పాటు ఉపాధి కూడా కోల్పోతున్నారు. సోమవారం కాప్రా మున్సిపల్ పరిధిలో మల్లాపూర్ డివిజన్ ఎలిఫెంట్ చౌరస్తా నుంచి శివ హోటల్ చౌరస్తా వరకు అక్రమ నిర్మాణాలను, షెడ్డులను మున్సిపల్ అధికారులు కూల్చేశారు. మల్లాపూర్ నోమా ఫంక్షన్ హాల్ ఎదుట ఓ తల్లీకొడుకు చెప్పుల దుకాణాన్ని కూల్చవద్దంటూ అధికారుల కాళ్లా వేళ్లాపడ్డారు. తనుకు షుగర్, బీపీ ఉన్నదని ఇల్లు గడవడమే కష్టంగా ఉందని, దుకాణాన్ని కూల్చితే బతకలేనని ఆ తల్లి కన్నీరుమున్నీరైంది. కానీ అధికారులు చలించలేదు. 'రెండు చేతులతో దండం పెడుతూ కేసీఆర్ సారూ ఎక్కడున్నావు. ఈ అన్యాయాన్ని చూడు. మమ్మల్ని మీరే కాపాడాలి. రేవంత్ మా బతుకును నాశనం చేస్తున్నాడు' అంటూ తల్లీకొడుకులు విజ్ఞప్తి చేశారు. జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశాలతో అక్రమణలను తొలగించినట్టు మున్సిపల్ సిబ్బంది తెలిపారు.

బ్రదర్ భద్రం.. బడుగులు ఛిద్రం

మొదటిపేజీ తరువాయి...

వ్యవహరించిన తీరు ఇప్పుడు సరికొత్త చర్చకు కారణమైంది. ఈ సొసైటీకి నెలన్నర క్రితమే నోటీసులిచ్చిన హైడ్రా ఇప్పటి వరకు అటువైపు పొరపాటున కూడా కన్నెత్తి చూడలేదు. ఆ సొసైటీలో నోటీసులు అందుకున్న వారిలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడి ఉండడమే అందుకు కారణమని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదేమో! ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని నిర్మాణాలకు ఆగస్టు 8న అధికారులు హడావుడిగా నోటీసులు జారీచేసి చేతులు దులుపుకొన్నారు. ఈ నోటీసులపై సొసైటీ హైకోర్టును ఆశ్రయించింది. ఎఫ్‌టీఎల్ విషయంలో తమకు అభ్యంతరాలు ఉన్నాయని, అది తేలేవరకు కూల్చివేతలు కూడదని న్యాయస్థానం తాజాగా తీర్పు ఇవ్వడంతో వారంతా హైడ్రా బుల్డోజర్ల నుంచి సేఫ్‌గా బయటపడ్డారు.

హైడ్రా దూకుడుకు కళ్లెం

అన్ని చెరువుల్లానే దుర్గం చెరువు కూడా అన్యాక్రాంతమైంది. ఈ చెరువు పరీవాహక ప్రాంతంలోనే అమర్ కోఆపరేటివ్ సొసైటీ ఉంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని ప్రాంతాలను పూడ్చివేసి దశాబ్దం క్రితమే ఇక్కడ కాలనీలు, రెసిడెన్షియల్ ప్రాజెక్టులు నిర్మించారు. దీనికే గత నెలలో హైడ్రా అధికారులు నోటీసులు జారీచేశారు. ఈ నోటీసులపై స్థానికులు అభ్యంతరాలను లేవనెత్తారు. చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణ అయ్యే వరకు కూల్చివేతలు చేపట్టవద్దని హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా విచారణ ప్రారంభించిన న్యాయస్థానం వారికి అనుకూలంగా తీర్పునిస్తూ హైడ్రా దూకుడుకు కళ్లెం వేసింది. ఈ విషయంలో హెచ్‌ఎండీఏ ప్రిలిమినరీ నోటిఫికేషన్‌లో ఉన్న పూర్తి విస్తీర్ణంలో అమర్ కోఆపటివ్ సోసైటీకి ఉన్న అభ్యంతరాలను చర్చించుకోవాలని తెలిపింది. ఆ తర్వాతే దుర్గం చెరువు పరీవాహక ప్రాంతంలో కూల్చివేతలపై నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఆరు వారాల్లోపు ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ధారించాలని ఆదేశించింది. దీంతో అప్పటి వరకు అక్కడ ఎలాంటి కూల్చివేతలు చేపట్టబోమని కోర్టుకు జీహెచ్‌ఎంసీ స్పష్టం చేసింది.

మొదటి నుంచీ వివాదాస్పదమే

అక్రమ నిర్మాణాల విషయంలో హైడ్రా తీరు మొదటి నుంచి వివాదస్పదంగానే ఉన్నది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే కూల్చివేతలకు ప్రణాళికలు రూపొందిస్తున్నారనే వాదన బలపడేలా వ్యవహరిస్తున్నది. అమర్ కోఆపరేటివ్ సొసైటీ విషయంలోనూ ఆయన ఆదేశాలనే హైడ్రా పాటిస్తున్నదని తేలింది. ఆ సొసైటీకి ఆగస్టులోనే నోటీసులు జారీచేసినా కూల్చివేతల విషయంలో సాధారణంగా చేసే హడావుడి చేయలేదు. దీంతో వారు హైకోర్టును ఆశ్రయించడం.. తాజాగా వారికి తీర్పు అనుకూలంగా రావడం జరిగిపోయింది. కోర్టు తీర్పుతో రేవంత్ సోదరుడు ప్రస్తుతానికి సేఫ్ గానే బయపడినట్టు లెక్క.

హైడ్రా కొరడా సామాన్యుడిపైనే

చెరువులు, కుంటలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయడమే లక్ష్యంగా పని చేస్తున్న హైడ్రా సామాన్యుడు నిర్మించుకున్న ఇండ్లపైనే కొరడా ఝుళిపిస్తున్నది. పేద, మధ్య తరగతి ప్రజలు నిర్మించుకునే ఇండ్లను కూల్చివేస్తున్నది. బిల్డర్లు, డెవలపర్లు చేసిన తప్పిదాలకు సామాన్యుల గూడు కూలిపోతున్నది. అదే సమయంలో రాజకీయ పలుకుబడితో చెరువులను అన్యాక్రాంతం చేసిన సంపన్నులను టచ్ చేసేందుకు కూడా సాహసించడం లేదు. ఎన్ కన్వెన్షన్ లాంటి నిర్మాణాలను కూల్చివేసినా, నల్లచెరువు పరివాహక ప్రాంతంలో ఉన్న నిర్మాణాలకు నోటీసులిచ్చిన ఏడు రోజుల్లోనే బుల్డోజర్లను ఎగదోసిన హైడ్రా కమిషనర్ అమర్ కో ఆపరేటివ్ సోసైటీ విషయంలో ఆచితూచి అడుగులు వేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ సొసైటీలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడి ఇల్లు ఉండడమే అందుకు కారణమని చెప్తున్నారు. ఈ కారణంగానే ఆగస్టులో నోటీసులు ఇచ్చి, వారు హైకోర్టును ఆశ్రయించి, విచారణ జరిగి, స్టే వచ్చేంత సమయం వరకు ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేశారని అంటున్నారు.

'దుర్గంచెరువు' కూల్చివేతలు ఉండవు

- హైకోర్టుకు హామీ ఇచ్చిన ప్రభుత్వం
- బాధితుల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలి
- ఎఫ్‌టీఎల్‌ను ఆరువారాల్లో నిర్ధారించాలి: హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాల కూల్చివేతల విషయంలో కఠిన చర్యలు చేపట్టబోమని లేక్‌ప్రొటెక్షన్ కమిటీ హామీ ఇచ్చింది. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేస్తామని, అప్పటివరకు కూల్చివేతలు ఉండబోవని వెల్లడించింది. పిటిషనర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరించి ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాలని, ఆరు వారాల్లో నిర్ణయం వెలువరించాలని హైకోర్టు లేక్ ప్రొటెక్షన్ కమిటీని ఆదేశించింది. ఈ ఆదేశాలను అమలు చేస్తామని అప్పటివరకు దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాల కూల్చివేత ఉండబోదని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దుర్గంచెరువు పరిధిలోని అమర్ సొసైటీలోనే నివాసముంటున్న సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి కూడా హైడ్రా నోటీసులు ఇచ్చింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగంపేట గ్రామం సర్వే నంబర్ 47లో దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారించకుండా కూల్చివేత నోటీసులు ఇచ్చారంటూ అమర్ సొసైటీ ప్లాట్ ఓనర్ల అసోసియేషన్ మరో ఇద్దరు వేర్వేరుగా వ్యాజ్యాలను దాఖలు చేశారు. వీటిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది దేశాయ్ అవినాష్, న్యాయవాది పిరాయ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నీటిపారుదల శాఖలోని చెరువుల మ్యాప్ ప్రకారం దుర్గంచెరువు విస్తీర్ణం 65 ఎకరాలు మాత్రమేనని, అయితే 160ఎకరాలని అధికారులు చెప్పడం చట్ట వ్యతిరేకమని చెప్పారు. బిల్డింగ్ రూల్స్ 2012లో వచ్చాయని, అప్పటికే హెచ్‌ఎండీఏ నిబంధనలకు అనుగుణంగా అనుమతులతో నిర్మాణాలు జరిగాయని, ఇప్పుడు వాటిని అక్రమ నిర్మాణాలని చెప్పి కూల్చివేత చర్యలు తీసుకోవడం దారుణమని అన్నారు. హెచ్‌ఎండీఏ అనుమతులతో చేపట్టిన నిర్మాణాలను కూల్చివేస్తామనడం సరికాదని అన్నారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు లేక్ ప్రొటెక్షన్ కమిటీ 2014 జూన్ 7న ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేస్తే ..అదే నెల 14న అభ్యంతరాలు చెప్పామని తెలిపారు. తుది నోటిఫికేషన్ కూడా వెలువడలేదని అన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది పీ శ్రీధర్‌రెడ్డి వాదిస్తూ.. ఒక ప్రజాహిత వ్యాజ్యంలో ఇదే హైకోర్టు చెరువుల ఎఫ్‌టీఎల్స్ నిర్ధారణ చేయాలని ఆదేశించిందని, హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా కూల్చివేత చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎఫ్‌టీఎల్స్‌ను మూడు నెలల్లో నిర్ధారించాలని ఇదే హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు.. లేక్ ప్రొటెక్షన్ కమిటీకి సమర్పించిన అభ్యంతరాలను అక్టోబర్ 4లోగా అందజేయాలని పిటిషనర్లను ఆదేశించింది. అభ్యంతరాలు పరిశీలించి ఆరు వారాల్లోగా ఎఫ్‌టీఎల్‌పై నిర్ణయాన్ని వెలువరించాలని లేక్ ప్రొటెక్షన్ కమిటీని ఆదేశించింది. ఈలోగా కూల్చివేత చర్యలు తీసుకోరాదని కమిటీని ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ న్యాయవాది ఇచ్చిన హామీని కోర్టు రికార్డుల్లో నమోదు చేసింది. కేసు పూర్వపరాల్లోకి వెళ్లడం లేదని స్పష్టం చేసింది. పిటిషన్లపై విచారణను మూసేసింది.

ఇప్పుడు ఎవరు వచ్చి ఏం చేస్తరు?

- ప్రభుత్వ ముఖ్యనేత బంధువు బేఖాతరు
- మంఖాల్ భూములపై విచారణ కమిటీ ఏటూ తేల్చదనే ధీమా

మహేశ్వరం, సెప్టెంబర్ 23 : మంఖాల్‌లోని ఇందిరమ్మ భూములు కార్పొరేట్ చెరలోకి వెళ్లిన వ్యవహారంపై 'నమస్తే తెలంగాణ'లో కథనం వచ్చిన తర్వాత స్థానికంగా పెద్దఎత్తున చర్చ జరిగింది. ఈ క్రమంలో ప్రభుత్వ ముఖ్యనేత బంధువు వద్ద ఈ విషయం ప్రస్తావనకు రావటంతో 'అయ్యేదేముంది? పోయేదేముంది?'.. రికార్డులు మారినయ్.. భూమి స్వాధీనమైంది.. ఇప్పుడు ఎవరు వస్తరు.. ఏం చేస్తరు?' అన్నట్టు సమాచారం. ఈ వ్యవహారంపై కొన్ని నెలల కిందట వేసిన విచారణ కమిటీ కూడా ఎటూ తేల్చదనే దృఢ సంకల్పంతో వారున్నట్టు స్పష్టమవుతున్నది. విచారణ కమిటీ కాలయాపన కూడా ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నది.

చౌటుప్పల్‌లో 'నమస్తే' కథనం హల్‌చల్

- ప్రభుత్వ కుట్రలు బహిర్గతం చేశారని 'నమస్తే తెలంగాణ'కు ప్రశంసలు
- తమ గోడును కండ్లకు కట్టారన్న బాధితులు
- వాట్సాప్ గ్రూపుల్లో స్టేటస్‌లు, డీపీలుగా కథనం
- గతంలో కోమటిరెడ్డి వ్యాఖ్యలు మరోసారి తెరపైకి
- అలైన్‌మెంట్ మారుస్తానన్న వీడియోలు వైరల్

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 23(నమస్తే తెలంగాణ)/చౌటుప్పల్: చౌటుప్పల్‌లో ట్రిపుల్‌ఆర్ భూ మాయం.. జంక్షన్.. ట్వన్స్ పేరుతో 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో సోమవారం ప్రచురించిన ప్రత్యేక కథనం సంచలనం సృష్టించింది. దక్షిణభాగం అలైన్‌మెంట్‌లో భాగంగా చౌటుప్పల్‌లో జంక్షన్‌ను 181 ఎకరాలకు విస్తరించటంపై.. ప్రభుత్వ కోణాన్ని ఆవిష్కరిస్తూ, జిల్లా మంత్రి, ఎమ్మెల్యే తీరును ఎండగడుతూ, బాధితు ఆవేదన, ఆందోళనను కండ్లకు కడుతూ ప్రచురించిన కథనం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నిర్వాసితుల వాట్సాప్ గ్రూపుల్లో విస్తృతంగా షేర్ అయ్యింది. ఎంతోమంది స్టేటస్‌గా, డీపీగా పెట్టుకొని.. ప్రభుత్వానికి తమ గోడు వినిపించేలా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లోనూ షేర్ చేశారు. తెలంగాణ బిడ్డల ఆస్తులను ఫణంగా పెడుతూ ఇతర ప్రాంత ప్రయాణికుల విందు, వినోదాల కోసం జంక్షన్ విస్తరణ చేయటాన్ని అడ్డుకుంటామని బాధితులు చెప్తున్నారు. అవసరమైతే న్యాయపోరాటానికి సిద్ధమని నిర్వాసితుల పక్షాన ట్రిపుల్ బాధిత సంఘం నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, చింతల దామోదర్‌రెడ్డి స్పష్టంచేశారు. ఈ క్రమంలో బాధితులంతా కలిసి న్యాయపోరాటానికి సిద్ధం అవుతున్నట్టు తెలిసింది.

తెరపైకి కోమటిరెడ్డి వీడియోలు

ట్రిపుల్ ఆర్ బాధితులతో గతంలో ఎంపీగా ఉన్నపుడు, ఇప్పుడు మంత్రి అయ్యాక కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యవహార శైలిపై 'నమస్తే తెలంగాణ' కథనంలో పేర్కొన్న అంశాలపై కలకలం రేపాయి. ఈ నేపథ్యంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గతంలో రాయగిరి రైతుల పక్షాన మాట్లాడిన మాటలను మరోసారి వైరల్ అయ్యాయి. అలైన్‌మెంట్ మార్చుతామని, బాధితులకు బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం ఇస్తామని చెప్పిన మాటలను బాధితులు సోషల్ మీడియా వేదికగా గుర్తుచేశారు. 'ఆ డిపార్ట్‌మెంట్ నాదే.. రోడ్ నాదే.. అలైన్మెంట్ మార్చేద్దాం' అని చెప్పిన వీడియోను వైరల్ చేశారు. ఇపుడేమో రైతులకు సమయం ఇవ్వకుండా ముఖం చాటేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

మూడు సార్లు భూములు తీసుకున్నరు

ఇప్పటికే మూడు సార్లు భూములు తీసుకున్నరు. అయినా సప్పుడు చేయలేదు. మళ్లీ ఇప్పుడు భూమి ఇవ్వుమంటున్నరు. మేం ఎట్ల బతకాలి? కాయకష్టం చేసుకుని చిన్నతనం నుంచి భూమిని నమ్ముకొని బతికినం. ప్రాణం పోయినా భూమి ఇచ్చేది లేదు. ఉన్న భూమిపోతే రోడ్డు మీద పడాల్సిందే. చూసే దిక్కు కూడా ఉండదు.

-జాల యాదయ్యయాదవ్, రైతు, చౌటుప్పల్

పాలకులు పట్టించుకోవడం లేదు

బాధితులకు న్యాయం చేసే విషయం లో కాంగ్రెస్ పాలకులు ఏమాత్రం పట్టించుకోవటం లేదు. ఎన్నిసార్లు వెళ్లినా రైతులకు బహిరంగ ధర ఇప్పిస్తామని అన్నరు. ఇప్పుడు ఎవరూ సప్పుడు చేస్తలేరు. ఇక్కడ జంక్షన్ వస్తే చౌటుప్పల్ మున్సిపాలిటీ రెండుగా చీలి అభివృద్ధి కూడా కుంటుపడుతుంది.

-గుండెబోయిన వేణుయాదవ్, రైతు, తంగడపల్లి

రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉన్నప్పుడు ఎందుకు మార్చరు

దక్షిణ భాగం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదని అంటున్నరు. మాది దక్షిణభాగమే కదా. జంక్షన్ మార్చే అవకాశం ఉంటుంది కదా. ఎందుకు ఇక్కడి రైతులను పట్టించుకోరు? మా తరపున అడిగే పెద్దలు ఎవరూ లేరా?

-జాల జంగయ్య యాదవ్, రైతు, తంగడపల్లి

మా పిల్లల భవిష్యత్తు ఏంది?

కొన్నేండ్ల నుంచి పరిశ్రమల కాలుష్యం మూలంగా పంటలు పండటం లేదు. ఇప్పటికే ఎంతో ఆర్థికంగా నష్టపోయాం. అయినా భూమి ఉందన్న ధీమాతో కష్టం చేసుకుని బతుకు వెళ్లదీస్తున్నం. ఇప్పుడు రింగురోడ్డు అని భూమి గుంజుకుంటే ఎట్లా? ఉన్న భూమి పోతే మా పిల్లల భవిష్యత్తు ఏంది?

-జాల అంజయ్య యాదవ్, రైతు, చౌటుప్పల్

మంఖాల్ భూముల దందాలో మరో ట్విస్ట్

- అదనపు భూములకు డబ్బు చెల్లించాలని రైతుల డిమాండ్
- సంబంధిత వ్యక్తులతో మాట్లాడాలంటూ మధ్యవర్తిపై ఒత్తిడి
- పనిలో పనిగా బీవోటీ రెండెకరాలపైనా అక్రమార్కుల కన్ను
- ప్రహరీ నిర్మిస్తుండటంతో అడ్డుకున్న అధికారులు

మహేశ్వరం, సెప్టెంబర్ 23: రంగారెడ్డి జిల్లా కందుకూరులోని మంఖాల్ లావణి పట్టా భూముల వ్యవహారం మరో కీలక మలుపు తిరిగింది. రైతుల పేర్ల మీద కాకుండా అదనంగా ఉన్న భూములను తమ పేరు మీదికి మార్చుకున్నందున ఆ విస్తీర్ణానికి కూడా డబ్బులు చెల్లించాలని లావణి పట్టా ఉన్న రైతులు డిమాండ్ మొదలుపెట్టారు. మంఖాల్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 608, 609, 610ల్లోని 35.36 ఎకరాలను ఇందిరాగాంధీ కాలంలోనే దళిత రైతులకు ఉపాధి కోసం ఇవ్వగా, ఈ భూములను ఒక కార్పొరేట్ కంపెనీతో పాటు కొందరు వ్యక్తులు చెరపట్టారు. ఈ బండారంపై 'నమస్తే తెలంగాణ'లో ఆదివారం 'ఇందిరమ్మ భూములకు కార్పొరేట్ చెర' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందులో రైతుల పేరిట రికార్డుల్లో లావణి పట్టాగా ఉన్న 35.36 ఎకరాలే కాకుండా అదనంగా 12 ఎకరాలు, మొత్తం 47.37 ఎకరాల భూమిని వీఆర్‌కే డెవలపర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్స్‌తో పాటు పలువురి పేర్లపై బదలాయించుకున్నారు. ఓ వైపు దీనిపై విచారణ కొనసాగుతున్నదని కలెక్టర్ శశాంక చెప్తున్నా, క్షేత్రస్థాయిలో సదరు కంపెనీ వాళ్లు భూమిని స్వాధీనం చేసుకొని చుట్టూ రేకులతో ప్రహరీ కూడా నిర్మించారు. రికార్డుల మార్పిడి జరిగినందున రైతులందరికీ డబ్బులు చెల్లింపులయ్యాయని అనుకున్నారు. కానీ 'నమస్తే తెలంగాణ' కథనం తర్వాత అసలు గుట్టు బయటపడింది. సదరు కంపెనీ, వ్యక్తులు.. రైతులకు కేవలం వారి పేరిట లావణి పట్టా ఉన్న 33.36 (రెండెకరాలు డంపింగ్ యార్డుకు కేటాయింపు) ఎకరాలకు మాత్రమే చెల్లింపులు చేసినట్టు వెల్లడైంది. దీంతో సదరు కంపెనీతో లావాదేవీ జరిపిన మధ్యవర్తి వద్దకు వెళ్లిన రైతులు తమకు రికార్డుల్లో ఉన్న మేర విస్తీర్ణానికే డబ్బులు వచ్చాయని, అదనంగా 12 ఎకరాలు కూడా వారి పేర్ల మీద ఎక్కినందున డబ్బులు ఇప్పించాలంటూ ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది.

ఆ.. రెండెకరాలూ కానిచ్చేస్తున్నారు?

మూడు సర్వే నంబర్లలో 608/5లో ఉన్న రెండెకరాల లావణి పట్టా భూమిని రైతు అమ్ముకునేందుకు యత్నించగా, రెవెన్యూ అధికారులు పీవోటీ కింద ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. గ్రామ అవసరాల నిమిత్తం చెత్త డంపింగ్ యార్డుకు కేటాయించారు. రికార్డులో సర్కారు భూమిగానే ఉన్నది. తాజాగా అంతా పోయాక.. ఈ రెండెకరాలు ఉండి ఏం లాభం అనుకున్నారో ఏమో! సోమవారం కొందరు వ్యక్తులు ఆ భూమి చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు పనులు మొదలుపెట్టారు. విషయం బయటికి పొక్కి అధికారుల దాకా వెళ్లింది. గంటల తరబడి తర్జనభర్జనలు పడిన అధికారులు ఎట్టకేలకు పనులు నిలిపివేయించినట్టు తెలిసింది. దీనిపై కొందరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనా సోమవారం వరకు మాత్రం ఫిర్యాదు ఇవ్వలేదు.

అసైన్డ్ భూమిలో కాంగ్రెస్ నేత పాగా

20 గుంటలు రిజిస్ట్రేషన్ చేసుకున్న అధికార పార్టీ నేత

- రెగ్యులరైజ్‌కు దరఖాస్తు.. తిరస్కరించిన అధికారులు
- రేకుల షెడ్లు ఏర్పాటు చేసినా పట్టని యంత్రాంగం
- జయశంకర్ జిల్లా కేంద్రం నడిబొడ్డున భూ దందా

జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): అసైన్డ్ భూమిలో అక్రమార్కులు నిర్మాణాలు చేపట్టడంతోపాటు ఏకంగా పట్టా పాస్ పుస్తకాలు పొందారు. ఇలా రూ.20 కోట్ల విలువ చేసే రెండెకరాల అసైన్డ్ భూమిని కాజేసేందుకు పక్కాప్లాన్ వేసుకున్నారు. రెవెన్యూ అధికారులు అడ్డుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ పక్కనే ఓ అధికార పార్టీ నేత ఏకంగా 20 గుంటల అసైన్డ్ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకొని జీవో 59 కింద రెగ్యులరైజ్ చేయాలని దరఖాస్తు చేసుకోవడమే కాకుండా షెడ్లు కూడా నిర్మించాడు. వీటి జోలికి మాత్రం అధికారులు వెళ్లడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కనే 170 సర్వే నంబర్‌లో 14 మంది దళిత పేద రైతులకు ఆరెకరాల అసైన్డ్ భూమిని 1975లో ప్రభుత్వం కేటాయించింది. చాలా మంది విక్రయించడంతో ప్రభుత్వం వారి హక్కు పత్రాలు రద్దు చేసింది. దీనిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టడంతో అధికారులు ఇండ్లకు తాళాలు వేశారు. వారు కోర్టుకు వెళ్లడంతో నిర్మాణాలను అధికారులు తొలిగించలేకపోయారు. అప్పటి నుంచి స్తబ్దుగా ఉన్న ఈ భూమిలో ప్రస్తుతం మళ్లీ అక్రమ నిర్మాణాలు మొదలయ్యాయి. నలుగురు వ్యక్తులు తమకు 1975లో ప్రభుత్వం సాగు హక్కు పత్రాలు ఇచ్చిందని, తహసీల్దార్ పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చారని సోమవారం రూ.2 కోట్ల విలువైన రెండెకరాల భూమిని చదును చేసి గది నిర్మాణం చేపట్టారు. రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి పనులు అడ్డుకున్నారు. 20 ఏండ్లకు పైగా సాగులో లేని అసైన్డ్ భూమికి పట్టా పాస్ పుస్తకాలు ఎలా జారీ అయ్యాయని, మున్సిపల్ స్థలంలో అనుమతులు లేకుండా ఎలా నిర్మాణాలు చేపట్టారని రెవెన్యూ అధికారులు ప్రశ్నించారు.

ఆ రేకుల షెడ్ల జోలికి వెళ్లని అధికారులు

170 సర్వే నంబర్‌లోని 20 గుంటల అసైన్డ్ భూమిలో ఓ అధికార పార్టీ నేత పాగా వేశారు. క్రయ విక్రయాలకు వీలు లేని అసైన్డ్ భూమిని కొనుగోలు చేశానని సదరు నేత ఏకంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అంతటితో ఆగకుండా 59 జీవో కింద రెగ్యులరైజ్ చేయాలంటూ దరఖాస్తు చేసుకుని రూ.10 లక్షలు డీడీ తీశాడు. అధికారులు అతడి దరఖాస్తును తిరస్కరించినా ఆ స్థలంలో షెడ్లు నిర్మించాడు. దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అధికార పార్టీ నేత కావడంతోనే చర్యలకు అధికారులు వెనుకాడుతున్నారనే ఆరోపణలున్నాయి.

జయశంకర్ భూపాలపల్లిలోని 170 సర్వే నంబర్‌లోని అసైన్డ్ భూమిలో నిర్మిస్తున్న గది

మాకు పట్టా ఇచ్చారు

170/3/1 సర్వే నంబర్‌లోని అసైన్డ్ భూమిలో 1975లో 14 మందికి 20 గుంటల చొప్పున హక్కు పత్రాలు ఇచ్చారు. పాస్ పుస్తకాలున్న నలుగురికి చెందిన 2 ఎకరాలను చదును చేస్తుండగా అధికారులు అడ్డుకుంటున్నారు.

- మోరె వెంకటయ్య

విచారణ జరుపుతున్నాం

170 సర్వే నంబర్‌లోని అసైన్డ్ భూమికి పట్టాలు ఎలా వచ్చాయనే విషయమై విచారణ జరుపుతున్నాం. ఇదే సర్వే నంబర్‌లో మరొకరు రిజిస్ట్రేషన్ చేసుకొని 59 జీవో కింద రెగ్యులరైజ్‌కు దరఖాస్తు చేసుకోగా తిరస్కరించాం.

- శ్రీనివాసులు, తహసీల్దార్

సింగరేణి తుది 'కీ'లో తప్పులు

రెండింటి సమాధానాలు తప్పుగా ఇచ్చారంటున్న అభ్యర్థులు

హైదరాబాద్, సెప్టెంబర్ 23(నమస్తే తెలంగాణ): సింగరేణి సంస్థలో మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్) పోస్టుల భర్తీకి నిర్వహించిన రాతపరీక్ష తుది 'కీ'లో తప్పులున్నట్టు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. రెండు ప్రశ్నలకు సమాధానాలు తప్పుగా ఉన్నట్టుగా పేర్కొంటున్నారు. ఈ తప్పులను సింగరేణి సంస్థ సీఎండీ దృష్టికి తీసుకెళ్లినా సవరించలేదని, తమకు అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్